# గెలుపు

ఇంకా తూరుపు తెల్లబడలేదు. ఆ రోజు త్వరగా మెలుకువ వచ్చింది వెంకటరత్నానికి. అసలు నిద్ర పోయాడో, మెలుకువనే ఉన్నాడో, అవి కలలో, తన ఆలోచనలో తెలియడం లేదు. అరచేతుల్లో ముఖం పెట్టుకుని చాలా సేపు కూర్చున్నాడు. లేచి లైటువేసి స్టాండుకు తగిలించి ఉన్న షర్టు జేబులోంచి మడతలు పెట్టి ఉన్న ఇన్లాండు కవరు తీశాడు. గది నిండా అడ్డదిడ్డంగా పడుకుని గాఢంగా నిద్రబోతున్నారందరూ—

ఎడాపెడా కాళ్ళు వేసుకుని, కొందరైతే వికృతంగా నోళ్ళుతెరుచుకుని, ఇక ఒంటి మీద గుడ్డలు సంగతి చెప్ప నక్కరలేదు. 'ఛీ' అనుకుని ముఖం మరో వైపుకి తిప్పుకున్నాడు వెంకటరత్నం. అక్కడా అదే సీను. నెమ్మదిగా తప్పించుకు వెళ్ళి తన పడక మీద కూర్చుని ఉత్తరం విప్పాడు. నిన్నటి నుంచీ ఎన్నిసార్లు చదివాడో లెక్కలేదు. అందులో ఏ విషయమూ తను మర్చిపోలేదు. అయినా ఆ ఒంకర టింకర అక్షరాల్లో ఎంతో దగ్గర తనాన్ననుభవిస్తూ మళ్ళా మళ్ళా చదివాడు. ఇటుకలు పేర్చినట్టు ఎన్నో విషయాలు చోటు చేసుకున్నాయ కాస్త కాగితం ముక్కలో.

మహారాజశ్రీ చిరంజీవులైన అన్నగార్కి మీ రామలింగం అనేక నమస్కారములతో వ్రాయునదేమనగా...అంటూ సాగిన ఆ ఉత్తరంలో ఎన్నో విషయాలు. అమ్మ పిన్నమ్మను చూసి రాడానికి ఈరపల్లి ఎళ్లి అక్కడే ఉండిపోయింది. వదినతో గాండ్ల బసయ్య మాదోస్తీగా ఉంటున్నాడు. అందుకనే అమ్మ ఇంట్లోంచెళ్లి పోయిందని ఊళ్ళో దొంగనాయాళ్ళంటున్నారు.. ఇలా ఒక్కోమాటా- ఒక్కోతూటా! ఒరే! నా మాటిని ఇంటికొచ్చేయ్. ఎందుకొచ్చిన సంపాదనరా! మేమంతా కట్టపడి కాపరాలు గడుపుకోవట్లేదా? అని హితవు.'ఆ రోజు ఎల్లెల్లు అని దేశం కాని దేశం తోలిందీ ఆడే'అనుకున్నాడు వెంకటరత్నం. తలుపు దబదబ కొట్టిన చప్పుడు. " కాఫీ వేణు మా, కాఫీ వేణుమా!''' అని హోటల్ కుర్రాడు అరుస్తున్నాడు. ''వేణుం వేణుం'' అని తలుపు తీశాడు వెంకటరత్నం. అతను ముకం కడుక్కుని వచ్చేసరికి కాఫీ సిద్ధంగా ఉంది. ఆ చల్లటి ఉదయపు గాలిలో అలా బాల్కనిలో నిలబడి వేడిగా కాఫీ తాగడ మొక్కటే ఈ ఊళ్ళో అతనికి 'హాయిగా అనిపించేది. హోటల్ ప్రక్క నుంచే ఓ ఎండిపోయిన కాలవ, మధ్య నెక్కడో ప్రవహించే ఓ పల్చని పాయ, కాలువకు అవతల ఒడ్డున దట్టంగా రబ్బరు తోట. రబ్బరు తోట మధ్యలో మెలికలు తిరిగిన కంకరరోడ్డు మీద బరువుగా కదుల్తున్న ఇసుక లారీలు. కనబడని పక్షులు తీసే రకరకాల రాగాలు. హోటలు ప్రక్కనుంచి కాలువ మీదకి జరిగిపోయిన చెట్ల కొమ్మల నిండా ఊదారంగు పూల గుత్తులు. అతనిక్కడికొచ్చిన ఆరు నెలల్లో ప్రతి ఉదయమూ కొత్తగా అనిపించే ఆ దృశ్యం ఈ రోజు కంటికి ఆనడం లేదు. మనసుకి పట్టడం లేదు. అతని మనసంతా తన ఇంటి మీద, తన వాళ్ళ మీద ఉంది. తన గదీ, ఆ మంచమూ, అడుగులకు మడుగులొత్తే పార్వతీ, పిల్లలూ- వాళ్ళ మాటలు, అమ్మ-ప్రేమగా ముఖాన్ని

# డి. సుజాతాదేవి

తడిమె ఆమె చూపులూ, రామలింగం, సైకిలు మీద సినిమా ప్రయాణాలు, నాటకాలు, పాటలు ఒకటేమిటి... ఎన్నో జ్ఞాపకాలు. ఇక్కడేముంది ఇటుకలు, సున్నమూ, మన్నూ- మశానము. తెల్లారి లేస్తే వీళ్ళ అరవగోల, వళ్ళికిలింపు. ఏమిటో- మనసు విప్పి మాట్లాడటానికి ఒక్క మనిషి లేదు. అన్నింటికీ మూగవాడిలా సైగలు. కొన్నాళ్ళిలాగే ఉంటే తనకు మాటలు వచ్చనే విష యమే మర్చిపోయే ప్రమాదం ఉంది. అసలిక్కడకు రాకుండానే ఉండాల్సింది. అందరూ ఒక్కచోట ఉంటే కలిగినంత వరకు కలో గంజో తాగి పడి ఉండవచ్చు. తనెంత డబ్బు పంపితే మాత్రం పిల్లలూ, పార్వతి తనులేకుండ ఉండ గలరా! రాకుండా ఉండాల్సింది. రామలింగం వ్రాసినట్టు వాళ్ళంతా ఆ ఊరిలో ఉండి బ్రతకట్లేదా! అసలిక్కడకు పంపించింది రామలింగం కదా! అనుకున్నాడు. అతని ఆలోచన వెనక్కి మళ్ళింది.

వెంకటరత్నానిది కృష్ణాజిల్లాలో ఓ పల్లెటూరు. తండ్రి పోయి నాలుగేళ్ళయింది. అన్నగారు ఇల్లరికం వెళ్ళిపోయాడు. తమ్ముడు కొంతు పాసై ఖాళీగా ఉన్నాడు. తల్లి, భార్య, ముగ్గురు పిల్లలు. తండ్రి చేసిన ఇటుకల వ్యాపారమే తనూ చేస్తున్నాడు. రామలింగం ప్రోద్బలంతో ఏలూరు దగ్గర ఇటుక తీసి స్వంతంగా ఆము వేశాడు. ఉన్నదంతా అమ్మి, అప్పులు తెచ్చి మదుపు పెట్టారు. అకాల వర్షం వచ్చి అంతా మట్టి పాలయింది. అక్కడితో ఆ కుటుంబానికి వెన్ను విరిగింది. అటు మునుపటి స్థాయిలో బ్రతకలేక, ఇటు క్రొత్త జీవితానికి అలవాటు పడలేక సతమతమయే సమయంలో ఈ అవకాశం. తమిళనాడులోని తిరువళ్ళూరులో పెద్ద హోటలు కట్టేస్తున్న ఓ ఆసామికి రాయి తీయించి పెట్టాలి. అది నిజానికి రామలింగానికి వచ్చిన అవకాశం. కాని అతను, "ఇల్లూ, వాకిలి- ఈ జంజూకానా అంతా ఒదులుకుని వెళ్ళలేను, నువ్వెళ్ళు" అని వెంకటరత్నాన్ని ప్రోత్సహించాడు. సరేనని వచ్చాడు. తినడానికి, ఉండడానికి ఇచ్చి, వెయ్యి రూపాయిలు వెలకిస్తున్నారు. నాలుగొందలు బ్యాంకులో వేసి ఆరొందలు ఇంటికి పంపిస్తున్నాడు. కాని పదిమంది పనివాళ్ళతో కలిసి ఆ గదిలో పడుకోవడం, వాళ్ళు పెట్టే తిండీ. అబ్బా! ఆ చేపలకూర, మజ్జిగ పులుసు భరించలేక పోతున్నాడు. ఒట్టి సాంబారుతోనే ప్రతిపూటా తింటూంటే కడుపులో ఖంగారు.

అన్నింటికన్నా భయంకరమైనది వాళ్ళు మాట్లాడుకునేది అర్థం కాకపోవడం. వాళ్ళేదో చెప్పుకుని వికవికలాడుకుంటారు. ఏదో లొడ లొడ వాగడం తప్ప ఒక్క ముక్క తెలియదు. పనికి సంబంధించి చిన్న చిన్న మాటలు అవసరమైనంత వరకూ వాడుతున్నాడు గాని ఈ గడబిడ ఏ మర్థమవుతుంది! పైగా తన గురించేదో చెప్పుకుంటున్నారని ఒక్కోసారి అనుమానం. వేలూ ఒక్కడే తననంటిపెట్టుకు తిరుగుతాడు. వాడి చూపుల్లో సానుభూతి కూడా ఒక్కోసారి భరించరానిదిగా ఉంటుంది. పనిలో ఉన్నంత సేపు బాగానే ఉంటుంది. ఒక రోజు వేలుతో కలిసి నాలుగు బజార్లు తిరిగి వచ్చాడు. అతడోచోట పాత పుస్తకాలు కొంటూంటే తనూ రెండు తెలుగు పుస్తకాలు కొన్నాడు. రూముకొచ్చి చదువుతుంటే ఓ హాస్య సన్ని వేశానికి చచ్చే నవ్వు వచ్చింది. ఎంత ఆపుకుందామన్నా ఆగకుండా తోసుకుని వచ్చింది. అతనలా ఊగి ఊగి నవ్వుతుంటే అందరూ వింతగా పిచ్చివాణ్ణి చూసినట్లు చూశారు.

వేలూ దగ్గర కొచ్చి ఏమిట నడిగాడు. ఏం చెప్పాలో అర్థం కాక ఏడుపొచ్చింది వెంకటరత్నానికి. పుస్తకం చూపించి ఊరుకున్నాడు. ఎప్పుడేనా గొంతెత్తి నాటకం పద్యాలు పాడుకోవాలనుంటుంది. కుదరదు. మొన్నెపుడో అమ్మకు జ్వరం కాస్తోందని పార్వతి ఉత్తరం వ్రాయించింది. పెద్ద వయసు, ఏ రోజు ఎటువంటిదో, ఏమైనా జరిగితే! మనసంతా పాడైపోయింది. ఆ రోజు అన్నం





తినలేక పోయాడు. అందరూ ఏమి టేమిటని అడిగారు. ఏం చెపుతాడు? తాపీ పని వాళ్ళలో ఒక్కడు తెలుగు తెలిసిన వాడున్నాడు. సాంబయ్యని నెల్లూరు జిల్లా నుంచొచ్చాడు. అతనేమిటో తప్పుకు తిరుగుతాడు. పైగా ఎప్పుడు చూసినా ఎర్రబడ్డ కళ్ళతో తూలుతున్నట్టుండే ఆ వాలకం అతనితో స్నేహంగా మాట్లాడనీయదు. ఇవన్నీ కలిసి అతన్నిక్కడ ఉండనీయటంలేదు. పైగా రామలింగం వ్రాసిన విషయాలు చదివాక అసలు మనసు నిలవడం లేదు. పార్వతి పిల్లల్ని పుట్టింటికి తీసుకెళ్ళినా ఉండలేక గోల చేసే అమ్మ, పిన్ని దగ్గరుండి పొడమేంటో, నిప్పులాంటి పార్వతిమీద నిందలేమిటో! ఈ పరిస్థితిలో పిల్లలెలా ఉన్నారో! తమ్ముడికి ఇటుక వ్యాపారం ఇష్టంలేదు. ఏదో మెకానిక్ షాపులో చేరి పని నేర్చుకుంటానన్నాడు. అదే మయిందో! ఎన్నో ఆలోచనలు. ఏమైనా ఇంటికెళ్ళడమే మంచిది అనుకున్నాడు వెంకటరత్నం.


అందరూ లేచి స్నానాలు చేసి తయారయేంత వరకు అలాగే ఆలోచిస్తూ నిలబడిపోయాడు వెంకటరత్నం. అందరితోపాటు వెళ్ళి టిఫిన్ తినలేదు. వేలూ మాత్రం రెండు మూడు సార్లు రమ్మని చేయి పట్టుకుని లాగాడు. ఆ రోజు పని చేయిస్తూనే ఉన్నా పరధ్యానంగానే ఉన్నాడు. ఇటిక తీయించడం ఆయిపోయింది. తను లేకపోతే మరో మనిషి ఈ అజమాయిషీ చూసుకోవచ్చు. ఇంకో పనికి తానెటూ అడ్వాన్సు తీసుకోలేదు కాబట్టి ఇపుడు వెళ్ళినా ఫరవాలేదు అనుకున్నాడు వెంకటరత్నం. ఎంత ఆలోచించినా రాబడి తప్ప ఏ విధమైన శాంతీ, సుఖమూ లేదు. అక్కడెలా ఉన్నారో! అని దిగులు. వయసులో ఒంటరి తనమూ ఇవన్నీ కృంగదీస్తున్నాయి వెంకటరత్నాన్ని. ఎలాగో సాంబయ్య సాయంతో యజమానికి చెప్పుజెప్పి ఇంటికి బయల్దేరాడు వెంకటరత్నం.

హఠాత్తుగా వెంకటరత్నం రావడం ఇంటిల్లిపాదినీ ఆనందంలో ముంచింది. ఇంట్లో క్రొత్తక్రొత్తసామాను. పార్వతిలో ఓ వింత అందం. పిల్లల ముఖాల్లో క్రొత్త కళ. ఇవన్నీ చూసిన వెంకటరత్నానికి ఆనందంగానే ఉంది. రెండు రోజులుండి తల్లిని తీసుకు రావడానికి వీరవల్లి వెళ్ళాడు. ఆ రెండురోజుల్లోను బసయ్య రాకపోకలూ, అతడికి తన ఇంట్లో ఏర్పడ్డ చనువూ గమనించాడు వెంకటరత్నం. అతడు తనకెంత అండగా ఉన్నదీ, ఆర్ద్ర స్వరంతో చెప్పింది పార్వతి. పైగా అతడు తన తమ్ముడికి ఐ.టి.ఐ..లో సీటు ఇప్పించడానికి పడరాని పాట్లు పడుతున్నాడట. అతని మంచితనం పట్ల కృతజ్ఞత పార్వతి గొంతులో వినిపిస్తున్నా, 'వయసులో ఒంటరి

తనం—ఈ కృతజ్ఞత ఎలా మారుతుందో!'అనిపించింది వెంకటరత్నానికి. ఏమైనా తల్లిని తీసుకురావాలి. తాని క్కడే ఉండాలి అనుకున్నాడు. కాని తల్లి రానంది. "బాబూ! మొగుడి రాజ్యం తన రాజ్యం, కొడుకు రాజ్యం పర రాజ్యం. అవి కోడలు సొంతం. నువ్వేమో పొట్ట చేత బట్టుకుని వెళ్ళిపోయావు. అదీ, దాని పిల్లలు నా లెక్కేమిటి. ఒక మాటా!మంతా!మంచా!వెడా! ఏముందక్కడ! ఇక్కడే పడి ఉంటాను. నువ్వు ఊరు వెళ్ళాక నాకూ నెలకింతని పంపించు'అందావిడ.

'నే వింక వెళ్ళనమ్మా నువ్వు వచ్చెయ్యి'అన్నాడు. 'అదేంట్రా అంత డబ్బొస్తుంటే అట్టాగంటావు' అని అయోమయంగా కొడుకు ముఖంలోకి చూసిందావిడ. ఇంకా ఏవో ఆ ఊరు గురించీ, గాలీ, వెలుతురూ, తిండి సౌకర్యం అడిగింది. ఆవిడకు తృప్తికరంగా సమాధానం చెప్పి ఆ రోజుకి ఉండి వచ్చాడు.

'నాన్నా! ఈ సారి నువ్వొచ్చినపుడు పట్టు పరికిణీ కుట్టించాలి'అంటుంది నాలుగేళ్ళ కూతురు, కాళ్ళకున్న కొత్త మువ్వల పట్టాలు మ్రోగించి చూపిస్తూ. 'పెద్దాడు వచ్చే ఏడు విజయవాడ హైస్కూల్లో చేరుతాడంట. ఇప్పటినుంచే సైకిలు కొనమని గోల-' ముసి ముసి నవ్వులతో అంటోంది పార్వతి. 'అన్నయ్యా! నాకు ఐ.టి.ఐ. లో సీటు తప్పకుండా వస్తుందన్నాడు బసయ్య. కాని ఓ వెయ్యి రూపాయలు ఖర్చవుద్ది చేరేసరికి. నువ్వెళ్ళంగానే ఆ డబ్బు పంపేట్టు చూడు.' వాడి




కళ్ళల్లో భవిష్యత్తు మీద బోలెడు ఆశ. 'మీరు పంపే డబ్బంతా దిగమింగి కూర్చోడంలే. రెండొందలు వీటి కలుపు తున్నా. కొన్నాళ్ళపాటు అక్కడ పని కాపాడు కున్నారంటే పిల్లలు వృద్ధిలోకొస్తారు. నాకూ కాస్తనల్ల పూసలోకి తెల్లపూస చేయించుకోవాలనుంటుంది కదా?' అంది పార్వతి. ఆశ్చర్యంగా ఉంది, కోపంగా ఉంది, దిగులుగా ఉంది, బెంగగా ఉంది వెంకటరత్నానికి.

ఏమిటి వీళ్ళంతా! తానేమనుకున్నాడు ఏమౌతుంది. తనను వదల్లేని బెంగ, తనకు దూరంగా ఉండలేని విచారం వీళ్ళకెవరికీ లేవా! తాను తిరిగి తమిళనాడు వెళ్ళకపోతే ఏం చేస్తారు అనుకున్నాడు.

వాళ్ళేం చేస్తారు? ఏం చెయ్యరు.

తల్లికి పాలో పళ్ళో కొనుక్కోవడానికి తానేమీ ఇవ్వలేదు.

తమ్ముడు ఐ.టి.ఐ. ఆశ ఒదులుకుని దుక్కి టెద్దులా పనిలో పడతాడు.

పార్వతి నల్లపూసలోకి తెల్లపూస ఉండదు.


పిల్లల జీవితంలో ఏ ఆశా, ఏ మెరుపూ, ఏ అందమూ ఉండదు అంతే!

మర్నాడే బట్టలు సర్దుకుంటున్న వెంకటరత్నాన్ని ఆశ్చర్యంగా చూసింది పార్వతి.'అదేమిటి పది రోజులైనా ఉండరా!'


జన్మ జన్మల విరహం పార్వతి గొంతులో జీరగా ధ్వనించింది.

"కొత్త పని కుదిరేట్టుగా ఉంది వెళ్తాను" అన్నాడు పొడిగా. చెప్పలేని శూన్యం పార్వతి గుండె నిండా ఆక్రమించింది. భావరహితంగా అతనివైపు చూసింది. పార్వతి చూపుల్లోని శూన్యం వెంకటరత్నం గుండెలోని వెలితి పూడ్చింది. ఓదార్పుగా ఆమె భుజం మీద చేయి వేశాడు వెంకటరత్నం.

గృహిణుల
ఆదరాభిమానాలు అందుకొన్న
శాంత టిల్టింగ్ వెట్ గ్రైండర్



santha



ధృఢమైన మోటారుతో పని చేస్తుంది.
నిశ్శబ్దమైన చలనం, 11-12 నిమిషాలలో పిండి
తయారీ, శుభ్రపరచడం ఎంతో తేలిక,
ఆకర్షణీయమైన రంగులతో 1 లీటరు,
$1\frac{1}{2}$ లీటరు, 2 లీటర్ల సైజులలో
అన్ని పట్టణములందు లభించును.

SUVARNA/PUSHPA

* 12 నెలల గ్యారంటీ * తక్షణ సర్వీసు సదుపాయం

* ప్రీతి ఎంపోరియమ్, PHONE: 64038
47-15-9, స్టేషన్ రోడ్, ద్వారకానగర్, వైజాగ్-16.
* మల్టి కమర్షియల్ ఎంటర్‌ప్రైజ్,
2-146/3, దుర్గామహాల్ ఎదురుగా, పటమట,
విజయవాడ-6. PHONE: 52521.



మీ ఆఫీసరు మీ మీద ఎప్పుడూ కాకాలు
మిరియాలు నూరుతుందా?
మీ ఆవిడ ఎప్పుడూ ముఖం ముడుచుకుంటుందా?
మీరు ప్రేమించిన అమ్మాయి మిమ్మల్ని
ప్రేమించడం లేదా?
మరి వాళ్ళని ముగ్ధుల్ని చేసుకోవడం ఎలా?
అయితే ఇదిగో.....
ఇదిగిడిగో మల్లిక్...
మల్లిక్ కార్టూనుల పుస్తకం ఇవ్వండి. పుస్తకం చదివి
ఘొల్లున నవ్వేసి, అంతలో నవ్వించిన మిమ్మల్ని
మెచ్చుకొని మీవాళ్ళయిపోతారు. తెలుగులో మొదటి
సారి ఫొటో ఆఫ్‌సెట్ ముద్రణలో ఉత్తమ శ్రేణిలో
రూపుదిద్దుకున్న ఏకైక కార్టూనుల పుస్తకం
'ఇదిగిడిగో మల్లిక్' ఫిబ్రవరి 15న విడుదలవుతోంది.
నేడే మీ కాపీ రిజర్వు చేసుకోండి.
వెల వెన్నెల నవ్వుల వెల కేవలం 15/- రూపాయలు మాత్రమే.
పుస్తకం మొదటి ఎడిషన్‌లో మాత్రమే మల్లిక్ రాసిన
మినీ 'నవ్వుల నవల' కూడా ఉంటుంది. కాబట్టి మొదటి
ఎడిషన్ అయిపోకముందే మీ కాపీని కొని హాస్యనవల
ఉచితంగా పొందండి. పోస్టులో తెప్పించుకోదలచినవారు
15/- రూ. M.O. చేస్తే పుస్తకం విడుదల కాగానే రిజిష్టర్డ్
పోస్టులో పంపుతాము.

ఆంధ్రప్రదేశ్ బుక్ డిస్ట్రిబ్యూటర్స్
3237, కృష్ణమూర్తి రోడ్, సికింద్రాబాద్-500003.